సాక్షి రంగారెడ్డి

శుక్రవారం ⸱ 13 ⸱ సెప్టెంబర్ ⸱ 2024



తక్కువ పెట్టుబడితో..

పట్టు పురుగల పెంపకంతో అధిక లాభాలు పొందొచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి సురేశ్ నాయక్ పేర్కొన్నారు. 8లో▸



గ్రామీణం.. జ్వర పీడితం

సీజనల్ జ్వరాలు పంజా విసురుతున్నాయి. గ్రామాల్లో ఎక్కడ చూసినా ఇంటింటా జ్వర పీడితులే దర్శనమిస్తున్నారు. 8లో▸



కాపాడుకుందాం

జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ హరిసర్వోత్తమన్ అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

చెరువుల్లో నిర్మాణాలపై ఇంటలిజెన్స్ ఆరా

సాక్షి ఎఫెక్ట్..

మొయినాబాద్: చెరువులు, కుంటల్లోని ఎఫ్‌టీఎల్ పరిధిలో చేసిన వెంచర్లు, నిర్మాణాలపై ఇంటలిజెన్స్ అధికారులు ఆరా తీశారు. మండలంలోని సురంగల్, పెద్దమంగళారం రెవెన్యూల్లోని చెరువులు, కుంటల్లో చేపట్టిన వెంచర్లు, నిర్మాణాలపై 'చెరువులు హాంఫట్!' శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ప్రభుత్వ యంత్రాంగం స్పందించింది. ఇంటలిజెన్స్ అధికారులు సురంగల్ రెవెన్యూలోని దర్గ కుంట, పెద్దమంగళారం రెవెన్యూలోని ఎల్లమ్మ కుంటకు సంబంధించిన విషయాలను తెలుసుకున్నారు. ఆయా గ్రామాల రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. ఏయే సర్వే నంబర్లలో చెరువు శిఖం ఉంది.. శిఖంలో వెంచర్లు, నిర్మాణాలను గుర్తించారు. ప్రభుత్వానికి ఇవ్వడానికి పూర్తి వివరాలతో నివేదిక సిద్ధం చేస్తున్నారు. మరోవైపు ఇరిగేషన్ అధికారులు సైతం ఆయా చెరువుల్లో జరిగిన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులకు లేఖలు రాశారు.

స్పీకర్‌ను కలిసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: తనను ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్‌గా నియమించినందుకు గాను గురువారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని స్పీకర్ కార్యాలయానికి వెళ్లిన ఎమ్మెల్యే ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

పూర్తిస్థాయిలో డ్రగ్స్ నిర్మూలన

ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలించడమే లక్ష్యంగా నిరంతరం దాడులను కొనసాగించాలని ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. నాంపల్లిలోని ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన రంగారెడ్డి జిల్లా సమీక్ష సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువత డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్త పడాలన్నారు. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌కు చెక్ పెట్టాలని సూచించారు. అనంతరం 'సే నో డ్రగ్స్' టీ షర్ట్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ దశరథ్, అసిస్టెంట్ కమిషనర్ కిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, శంషాబాద్ వికారాబాద్, మల్కాజిగిరి, మేడ్చల్, సరూర్ నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌లు కృష్ణప్రియ, విజయభాస్కర్, ఫయాజుద్దీన్, కె.నవీన్ కుమార్, ఉజ్వల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొన్న అటాచ్ చేసి.. నిన్న బదిలీ నిలిపి

ఇబ్రహీంబాగ్ ఏడీఈపై చర్యలకు వెనకడుగు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో ఓ ఏడీఈపై క్రమ శిక్షణ చర్యల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. అవినీతి ఆరోపణలు, విధి నిర్వహణలో నిర్లక్ష్యంపై సీరియస్ అయిన యాజమాన్యం ఆ తర్వాత రాజకీయ, ఉద్యోగ సంఘాల ఒత్తిళ్లకు తలొగ్గక తప్పలేదు. క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా సూచిస్తూ డిస్కం సీఎండీ ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాల్సి రావడం సర్వత్రా చర్చనీయాంశమైంది. సైబర్‌సిటీ సర్కిల్ ఇబ్రహీంబాగ్ డివిజన్ ఇంజనీర్లపై సీఎండీకి ఫిర్యాదులు అందాయి. అంతర్గత విచారణ చేపట్టిన సీఎండీ నార్సింగి ఏఈని సస్పెండ్ చేశారు. ఇబ్రహీంబాగ్ ఏడీఈని కార్పొరేట్ ఆఫీసుకు అటాచ్ చేశారు. డీఈ సహా మరో ఏఏఈకి చార్జి మెమోలు జారీ చేశారు. తాజాగా ఏడీఈపై తీసుకున్న క్రమశిక్షణ చర్యలను నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం విశేషం. ఇప్పటికే విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న 19 మంది ఇంజనీర్లపై చర్యలు తీసుకున్న సీఎండీ ఇబ్రహీంబాగ్ ఏడీఈ విషయంలో ఎందుకు వెనక్కి తగ్గారనేది అంతు చిక్కడం లేదు. ఈ అంశంపై వివరణ కోరేందుకు ఉన్నతాధికారులను 'సాక్షి' సంప్రదించగా ఎవరికి వారు తమకేమి సంబంధం లేదన్నట్లు చెప్పి తప్పించుకోవడం కొసమెరుపు.

మహా టౌన్‌షిప్‌లు

ఓఆర్‌ఆర్ నుంచి ట్రిపుల్ ఆర్ మధ్యలో..

- రైతుల నుంచి భూములు సేకరించనున్న హెచ్‌ఎండీఏ
- ఫ్యూచర్ సిటీ అభివృద్ధే లక్ష్యంగా అడుగులు
- రోడ్లు, రవాణా, మౌలిక సదుపాయాలకు ప్రణాళికలు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: శరవేగంగా విస్తరిస్తున్న మహా నగరానికి అనుగుణంగా ఔటర్‌రింగ్ రోడ్డు నుంచి ప్రతిపాదిత రీజినల్ రింగ్‌రోడ్డు వరకు సకల సదుపాయాలతో టౌన్‌షిప్‌ల ఏర్పాటుకు హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) ప్రణాళికలు రూపొందించింది. ఇందుకోసం రైతుల నుంచి భూములను సేకరించి లేఅవుట్‌లను అభివృద్ధి చేయనుంది. రోడ్లు, రవాణా, విద్యుత్, తాగునీరు, పార్కులు తదితర మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేసిన లే అవుట్‌లలో 60 శాతం భూమిని తిరిగి రైతులకు అందజేయనుంది. మిగతా 40 శాతం భూమిని హెచ్‌ఎండీఏ ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా విక్రయించనుంది.

వాటి తరహాలోనే..

- నగరంలోని ఉప్పల్ భగాయత్, కోకాపేట్, బుద్వేల్, మోకిల్లా, బాచుపల్లి, హయత్‌నగర్, మేడిపల్లి తదితర ప్రాంతాల్లో హెచ్‌ఎండీఏ సొంత భూములతో పాటు, రైతుల నుంచి సేకరించిన భూముల్లో లేఅవుట్‌లను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కోకాపేట్, బుద్వేల్, మోకిల్లాలో హెచ్‌ఎండీఏ ప్లాట్‌లు హాట్‌కేకుల్లా అమ్ముడయ్యాయి. రియల్ ఎస్టేట్ సంస్థలు, బడా నిర్మాణ సంస్థలు పెద్ద ఎత్తున పోటీపడి స్థలాలను కొనుగోలు చేశాయి. ఇదే తరహాలో ఔటర్ నుంచి రీజినల్ రింగ్‌రోడ్డు వరకు ప్రతిపాదించిన రేడియల్ రోడ్లకు ఆనుకొని టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేసేందుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు.

అంతర్జాతీయ ప్రమాణాలకనుగుణంగా..

- ప్రభుత్వం హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తరువాత నాలుగో నగరంగా నాలుగో నగర నిర్మాణానికి ప్రణాళికలను రూపొందిస్తోన్న సంగతి తెలిసిందే. అంతర్జాతీయ హంగులతో అభివృద్ధి చేయనున్నట్లు భావిస్తున్న ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగానే అత్యాధునిక టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేయనున్నారు. మరోవైపు ప్రభుత్వం ఓఆర్‌ఆర్ వరకు ఉన్న ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీ వరకు పెంచడంతో పాటు హెచ్‌ఎండీఏ పరిధిని రీజినల్ రింగ్‌రోడ్డు వరకు విస్తరించింది. దీంతో హెచ్‌ఎండీఏ పరిధి 7,250 చదరపు కిలోమీటర్ల నుంచి సుమారు 10 వేల చదరపు కిలోమీటర్ల వరకు విస్తరించనుంది. ఇందుకనుగుణంగానే భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని టౌన్‌షిప్‌ల అభివృద్ధిపై దృష్టి సారించింది.

ఫ్యూచర్ సిటీలో ఇలా..

ఓఆర్‌ఆర్‌ను, ట్రిపుల్ ఆర్‌ను కలుపుతూ రావిర్యాల నుంచి ఆమనగల్లు వరకు 300 మీటర్ల విస్తీర్ణంలో నిర్మించనున్న 41.5 కిలోమీటర్ల రేడియల్ రోడ్డు మార్గంలో టౌన్‌షిప్పులను అభివృద్ధి చేసేందుకు హెచ్‌ఎండీఏ దృష్టి సారించింది. రేడియల్ రోడ్డుకు రెండు వైపులా మొదటి దశలో ఒక కిలోమీటర్ పరిధిలో, రెండో దశలో 500 మీటర్ల పరిధిలో టౌన్‌షిప్‌ల విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకోసం రైతుల నుంచి భూములను సేకరించి అభివృద్ధి చేస్తారు. ఇందులో రోడ్లు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు, ప్రజారవాణా సదుపాయాలు, పార్కులు, వ్యాపార, వాణిజ్య కేంద్రాలు తదితర మౌలిక సదుపాయాలతో పాటు సుమారు 353.72 ఎకరాల్లో భవన నిర్మాణాల కోసం ప్లాట్‌లను కేటాయిస్తారు. రెండో దశలో మరో 171.65 ఎకరాల విస్తీర్ణంలో నివాస సముదాయాలను ఏర్పాటు చేయనున్నారు. రైతుల నుంచి సేకరించి అభివృద్ధి చేసినందుకు హెచ్‌ఎండీఏ 40 శాతం ప్లాట్‌లను తన వాటాగా తీసుకోనుంది. మిగతా 60 శాతం ప్లాట్‌లను రైతులు విక్రయించుకోవచ్చు.

రేడియల్ రోడ్డు రూట్ ఇదే..

ఔటర్‌రింగ్‌రోడ్డు ఎగ్జిట్ 13 నుంచి రావిర్యాల మీదుగా ఆమనగల్లు వరకు నిర్మించనున్న రేడియల్ రోడ్డు పరిధిలో కొంగరకుర్దు, కొంగరకలాన్, ఫిరోజ్‌గూడ, లేమూరు, తిమ్మాపూర్, రాచలూరు,గుమ్మడవెల్లి, పంజాగూడ, మీర్‌ఖాన్‌పేట్, ముచ్చర్ల, కుర్మిద్ద, కడ్తాల్, ఆమనగల్లు, ఆకుతోటపల్లి తదితర ప్రాంతాలు రానున్నాయి.

మొదటి దశలో..

రేడియల్ రోడ్డుకు ఇరువైపులా కిలోమీటర్ పరిధిలో 21 లక్షల చదరపు మీటర్ల (518.92 ఎకరాలు) విస్తీర్ణంలో టౌన్‌షిప్ అభివృద్ధి

అభివృద్ధి చేయనున్న ప్రాంతం	చదరపు మీటర్లు	ఎకరాలు	శాతం
రోడ్డు ఏరియా	3,78,360.0	93.49	18.10
సోషల్ ఇన్‌ఫ్రా ఏరియా	70,378.9	17.39	3.37
సదుపాయాలు	41,027.4	10.14	1.96
పార్క్ ఏరియా	1,68,781.4	41.71	8.08
మొత్తం	6,58,547.68	162.73	31.51
ఇందులో ప్లాట్ల ఏరియా	14,31,452.0	353.72	68.49
రైతుల వాటా	8,58,871.2	212.23	41.09 (60)
హెచ్‌ఎండీఏ వాటా	5,72,580.8	141.49	27.39 (40)

రెండో దశలో..

- రేడియల్ రోడ్డుకు ఇరువైపులా 500 మీటర్‌ల పరిధిలో టౌన్‌షిప్ అభివృద్ధి.
- అభివృద్ధి చేయనున్న ఏరియా 10,90,000 (269.34 ఎకరాలు) చదరపు మీటర్లు.

వివిధ అవసరాల కోసం కేటాయింపులు ఇలా..

అభివృద్ధి	చదరపు మీటర్లు	ఎకరాలు	శాతం
రోడ్డు ఏరియా	2,54,448.0	62.88	23.34
సోషల్ ఇన్‌ఫ్రా	31,446.2	7.77	2.88
సదుపాయాలు	27,707.3	6.85	2.54
పార్కు ఏరియా	81,751.5	20.20	7.50
మొత్తం	3,95,353	97.69	36.27
ఇందులో ప్లాట్ల ఏరియా	6,94,646.9	171.65	63.73
రైతుల వాటా	4,16,788.1	102.99	38.23 (60)
హెచ్‌ఎండీఏ వాటా	2,77,858.8	68.66	25.49 (40)



కేశంపేట పోలీస్ స్టేషన్ ఎదుట బీఆర్‌ఎస్ నాయకుల ఆందోళన

• అట్టుడికిన కేశంపేట

కేశంపేట ఠాణా గురువారం సాయంత్రం అట్టుడికింది. హైదరాబాద్‌లో సీపీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగిన మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు బీఆర్‌ఎస్ నేతలను గురువారం పోలీసులు అరెస్టు చేసి ఇక్కడికి తరలించారు. సమాచారం అందుకున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చారు. నినాదాలతో హోరెత్తించారు. పోలీస్ ఎస్కాట్ వాహనం అద్దాలను ధ్వంసం చేశారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత తలెత్తింది.

– షాద్‌నగర్/కేశంపేట



కేశంపేట ఠాణాలో హరీశ్‌రావు తదితరులు



రోడ్డుకు అడ్డంగా ఉంచిన జేసీబీ

లాంఛనమేనా!

- నేడు పెద్దఅంబర్‌పేట'లో అవిశ్వాసం
- తేలనున్న చైర్‌పర్సన్ చెవుల స్వప్న భవితవ్యం
- మెజార్టీ కౌన్సిలర్లు జయశ్రీకి మద్దతు





చెవుల స్వప్న



జయశ్రీ

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట మున్సిపల్ పరిధిలోని తట్టిఅన్నారం వార్డు కార్యాలయంలో అవిశ్వాస ప్రత్యేక సమావేశం శుక్రవారం జరగనుంది. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ చెవుల స్వప్నపై పెట్టిన అవిశ్వాసం నేపథ్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తారు. సమావేశ మందిరంలోకి కౌన్సిలర్లకు మాత్రమే అనుమతించనున్నారు. అవిశ్వాస ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు కలగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

గోవా నుంచి చేరుకున్న కౌన్సిలర్లు

పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం 8వ వార్డు కౌన్సిలర్ పండుగల జయశ్రీ ఆధ్వర్యంలో అవిశ్వాస నోటీసుపై సంతకాలు చేసిన 16 మంది కౌన్సిలర్లను గోవాలోని క్యాంప్‌లో ఉంచారు. గురువారం గోవా నుంచి వచ్చిన కౌన్సిలర్లు నగర శివారులోని ఓ రిసార్ట్‌లో బస చేసినట్లు తెలిసింది. శుక్రవారం ఉదయం నేరుగా సమావేశానికి హాజరుకానున్నట్లు సమాచారం. ప్రతి చోటా చైర్‌పర్సన్‌గా పోటీ పడే వ్యక్తులే క్యాంపులను నిర్వహిస్తుండగా, ఇక్కడ మాత్రం పలువురు కౌన్సిలర్లే చైర్‌పర్సన్‌ను దింపేందుకు సొంతంగా ఖర్చుచేసి మరీ క్యాంపులకు వెళ్లారు. పండుగల జయశ్రీకి మద్దతు ప్రకటిస్తుండడం విశేషం.

మెజార్టీ కౌన్సిలర్ల సంతకాలు

పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలో మొత్తం 24 మంది కౌన్సిలర్లు ఉండగా చైర్‌పర్సన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గేందుకు అవసరమైన 2/3 వంతు కౌన్సిలర్లు సంతకాలు చేశారు. దీంతో చైర్‌పర్సన్ చెవుల స్వప్న అవిశ్వాసంలో గట్టెక్కేది సందేహమే. అవిశ్వాస సమావేశాన్ని నిర్వహించకుండా స్టే విధించాలంటూ చైర్‌పర్సన్ చెవుల స్వప్న కోర్టును ఆశ్రయించగా ఆమె పిటిషన్‌ను కోర్టు తిరస్కరించినట్లు సమాచారం. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన అవిశ్వాసానికి ఒక బీజేపీ సభ్యుడు, బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఐదుగురు కౌన్సిలర్లు మద్దతివ్వడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. అవిశ్వాసాన్ని ఎదుర్కొంటున్న చెవుల స్వప్నకు ముగ్గురు కౌన్సిలర్లు మాత్రమే మద్దతు తెలుపుతుండగా వారితో పాటు మొదటి నుంచి తటస్థంగా ఉన్న వైస్‌చైర్‌పర్సన్ చామ సంపూర్ణ, ఇద్దరు కల్వంచకు చెందిన కౌన్సిలర్లు అవిశ్వాస సమావేశాని హాజరు అవుతారా లేదా అన్నది వేచి చూడాల్సిందే.



క్యాంపును సందర్శించి రైతులతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నేడు మదర్ డెయిరీ ఎన్నికలు

- ఆరు డైరెక్టర్ స్థానాలకు పోలింగ్
- ఉదయం 8 నుంచి ఒంటిగంట వరకు ఓటింగ్
- హయత్‌నగర్‌లోని ఎస్‌వీ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాట్లు
- రేపు ఫలితాల వెల్లడి

ఇబ్రహీంపట్నం రూరల్: మదర్ డెయిరీ డైరెక్టర్లకు సంబంధించిన ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. హయత్‌నగర్‌లోని ఎస్‌వీ కన్వెన్షన్ హాలులో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఓటింగ్ కొనసాగుతుంది. నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలకు చెందిన పాల ఉత్పత్తిదారుల సహకార సమితి చైర్మన్లు ఇందులో పాల్గొంటారు. శనివారం ఫలితాలు ప్రకటిస్తారు. అనంతరం నూతన పాలకవర్గం సమావేశమై డెయిరీ చైర్మన్‌ను ఎన్నుకుంటుంది.

200 మందితో క్యాంప్

ఈ ఎన్నికల కోసం నల్లగొండ నుంచి రైతులను తీసుకొచ్చి ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని బొంగ్లూర్‌లో క్యాంపు ఏర్పాటు చేశారు. ప్రమిద గార్డెన్ దీనికి వేదికైంది. మదర్ డెయిరీలో 297 మంది సభ్యులుగా ఉన్నారు. 15 మంది డైరెక్టర్లను ఎన్నుకోవాల్సి ఉండగా.. ఇప్పటికే 9మంది ఎన్నికయ్యారు. మరో ఆరుగురి కోసం ఎన్నిక కొనసాగనుంది. అనంతరం 15 మంది డైరెక్టర్లు నూతన చైర్మన్‌ను ఎన్నుకుంటారు. ఈ నేపథ్యంలో సంఘంలోని సుమారు 200 మంది ఓటర్లు మూడు రోజులుగా ఇక్కడే బస చేశారు. క్యాంపు చుట్టూ పోలీసు పహారా ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు వీరికి అవసరమైన ఏర్పాట్లను చూస్తున్నారు.

శిబిరాన్ని సందర్శించిన మంత్రి

ప్రమిద గార్డెన్‌లో ఏర్పాటు చేసిన క్యాంపును గురువారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సామేలు, వేముల వీరేశం, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, బీర్ల ఐలయ్య తదితరులు సందర్శించారు. అందరూ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సూచించారు. రైతులు క్యాంపు నుంచి నేరుగా ఎలక్షన్ సెంటర్‌కు వెళ్లారు.

ఆక్రమణల పర్వం!

- కబ్జారాయుళ్ల చెరలో చెరువులు, కుంటలు
- రెచ్చిపోతున్న 'రియల్' వ్యాపారులు
- బఫర్‌జోన్‌లో యథేచ్ఛగా నిర్మాణాలు
- అంతరించిపోతున్న జల వనరులు
- పట్టించుకోని అధికారులు
- పరిరక్షించాలని కోరుతున్న ప్రజలు

ఇబ్రహీంపట్నం రూరల్: చెరువులు, కుంటలు, కాలువలు యథేచ్ఛగా ఆక్రమణలకు గురవుతున్నాయి. ఏకంగా కలెక్టరేట్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్నవి కూడా కబ్జారాయుళ్ల చెరలోకి వెళ్లిపోయాయి. అయినా ఇటు ఇరిగేషన్, ఆటు రెవెన్యూ అధికారులు సైతం ఈ ఆక్రమణలపై పెదవి విప్పకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెరువులను చెరబడితే చెరసాలకే అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో కబ్జారాయుళ్ల గుండెల్లో దడ పుట్టుకుంది. ఇప్పటికైనా జల వనరుల్లో ప్రధానమైన చెరువులను పరిరక్షిస్తారో లేదో చూడాలి.

చెరలో చారిత్రక చెరువులు

- కలెక్టరేట్‌కు సమీపంలోని కొంగరకలాన్‌లో వందల ఏళ్ల చరిత్ర కలిగిన చెరువులు ఉన్నాయి. వీటిలో అతిముఖ్యమైంది కొత్త చెరువు. ఊరికి పడమరవైపు కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉంది. ఈ చెరువు విస్తీర్ణం 18.77 ఎకరాలు. ఓ రియల్ ఎస్టేట్ సంస్థ ఈ చెరువును కబ్జా చేసింది. శిఖంతో పాటు ఎఫ్‌టీఎల్‌లో ప్లాట్లు చేసింది. బఫర్‌జోన్‌ను సైతం ఆక్రమించి రియల్ వ్యాపారంతో రూ.కోట్లు గడించింది. ప్రస్తుతం చెరువు పట్టుమని పది ఎకరాలు కూడా లేదు.
- కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో వడ్లవాని కుంట 5.77 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ కుంటను సైతం ఓ రియల్ ఎస్టేట్ సంస్థ రెండు ఎకరాల మేర ఆక్రమించింది. బఫర్‌జోన్‌ను కూడా వదిలిపెట్టకుండా రోడ్లు, ప్లాట్లు చేసింది.
- గ్రామానికి ఉత్తరాన ఉన్న అతిపెద్ద దాతర్ చెరువు విస్తీర్ణం 50.12 ఎకరాలు. ఈ చెరువులో ఏకంగా కబ్జారాయుళ్లు కడీలు పాతారు. దీనిపై కొంతమంది కోర్టులను సైతం ఆశ్రయించారు. ఈ చెరువులోకి వచ్చే కాలువలు కూడా పెద్ద ఎత్తున కబ్జాకు గురయ్యాయి.
- దాతర్‌చెరువు నిండితే కాలువల నుంచి నేరుగా ఇబ్రహీంపట్నం చెరువులోకి నీరు వెళ్తుంది. ఈ కాలువను కూడా వదిలిపెట్టడం లేదు. ఇటీవల కొత్తగా వేస్తున్న ఓ వెంచర్ నిర్వాహకులు కాలువను కబ్జా చేసి ప్రహరీ నిర్మించారు. వెంచర్‌లో వేసిన డ్రైనేజీ పైపులైన్లు ఇదే కాలువలోకి కలిపారు. గొలుసుకట్టు చెరువుల్లోకి వెళ్లే నీరు వెళ్లకుండా అడ్డుగోడలు నిర్మించారు. 60 ఫీట్ల వెడల్పు పారే ఈ కాలువ పూర్తిగా కుంచించుకుపోయింది.
- ఆయా కబ్జాలపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. అయినా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రకృతి సిద్ధమైన జల వనరులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు



కొత్త చెరువు పూర్తిగా కబ్జాకు గురైంది. చెరువు నిండితే ఎంతో కళ ఉండేది. ఇప్పుడు సగానికి పైగా ప్లాట్లు చేశారు. ఊర్లో అన్ని చెరువులదీ ఇదే పరిస్థితి. ఎవరూ పట్టించుకోవడం లేదు.

– గోపగళ్ల స్వామి, రైతు, కొంగరకలాన్

చర్యలు తీసుకుంటాం



కొంగరకలాన్‌లో చెరువులపై ఫిర్యాదులు అందాయి. పరిశీలించి కబ్జాకు గురైనట్లు నిర్ధారించాం. రెవెన్యూ అధికారులకు లేఖ రాశాం. మొత్తం విస్తీర్ణంపై సర్వే చేయమని అడిగాం. సర్వే చేస్తే పూర్తిగా లెక్క తేలుతుంది. కబ్జాకు గురైనట్లు తేలితే చర్యలు తప్పవు.

– రాజ్యలక్ష్మి, ఇరిగేషన్ ఏఈ, ఇబ్రహీంపట్నం



దాతర్‌చెరువు నుంచి వచ్చే కాలువను కబ్జా చేసి బఫర్‌జోన్‌లో నిర్మాణం



కొత్త చెరువులో వెలిసిన ప్లాట్లు

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

కొత్తూరు: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన కొత్తూరు పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని జెడ్పీ హెచ్ఎస్ పాఠశాల వెనకాల ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న చాకలి యాదమ్మ(45) నోరు, ముక్కు నుంచి రక్తం కారి మృతి చెంది ఉంది. దీన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం చేరవేశారు. అక్కడికి చేరుకున్న పోలీసులు పరిసరాలను పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై మృతురాలి కూతురు రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సభ్యత్వ నమోదు వేగవంతం

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి

- టార్గెట్ పూర్తి చేయాలని పిలుపు



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: బీజేపీ సభ్యత్వ నమోదును గ్రామాల్లో వేగంగా చేయాలని, ఇచ్చిన టార్గెట్‌ను పూర్తిచేయాలని రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సనివెల్లి ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డిలు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని చాకలిగూడ, కేతిరెడ్డిపల్లి గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదులో భాగంగా ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ పిలుపు మేరకు ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి తూర్పు మాధవరెడ్డి, మల్లేష్, లక్ష్మణ్, రవీందర్, ప్రభాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటేష్, చంద్రశేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు.

బీజేపీతోనే అన్ని వర్గాలకు న్యాయం

మొయినాబాద్: బీజేపీతోనే దేశం సుభీక్షంగా ఉంటుందని, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సన్వెల్లి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని వెంకటాపూర్‌లో మండల ఇన్‌చార్జి పల్లె శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, మోదీ పాలనతో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. అందుకే యువత మొత్తం బీజేపీవైపు చూస్తోందన్నారు. యువతతోపాటు ప్రజలందరూ బీజేపీ సభ్యత్వం తీసుకోవడానికి ముందుకొస్తున్నారన్నారు.

గ్రామీణం.. జ్వర పీడితం!

- పల్లెల్లో విజృంభిస్తున్న జ్వరాలు
- మండలాల్లో పెరుగుతున్న ఫీవర్ బాధితులు
- కానరాని నివారణ చర్యలు


షాబాద్‌లో ఇంటింటి జ్వర సర్వే చేస్తున్న ఆరోగ్యశాఖ సిబ్బంది

షాబాద్: సీజనల్ జ్వరం జిల్లా వ్యాప్తంగా పంజా విసురుతోంది. మారుమూల గ్రామాల్లో ఎక్కడ చూసినా ఇంటింటా జ్వర పీడితులే దర్శనమిస్తున్నారు. దీంతో జ్వరాలపై ఇంటింటికి తిరిగి వైద్య అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. అయినా వర్షాకాలం నేపథ్యంలో పారిశుద్ధ్యం లోపించి దోమల విజృంభణ కొనసాగుతోంది. ఇళ్ల మధ్య ఖాళీ ప్రదేశాల్లో నిలిచిన నీటిలో దోమ లార్వా వృద్ధి చెంది సీజనల్ జర్వాలకు కారణం అవుతున్నాయి. ప్రధానంగా డెంగీ, మలేరియా దోమల సంతతి వేగంగా వృద్ధి చెందుతోంది. జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధులపై అవగాహన లేకపోవడం, అధికారుల నుంచి ముందు జాగ్రత్త చర్యలు లోపించడంతో జ్వరపీడితుల సంఖ్య పెరుగుతుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పొంచి ఉన్న డెంగీ ముప్పు

పది రోజులుగా జిల్లాలో రోజురోజుకూ సీజనల్ జ్వర పీడితుల సంఖ్య పెరుగుతోంది. గతేడాది జిల్లా వ్యాప్తంగా డెంగీ కేసులు ఎక్కువగా నమోదు కాగా, ఈ సీజన్‌లో ఇప్పటికి తక్కువ శాతం డెంగీ కేసులే నమోదయ్యాయి. ఎక్కువ మంది రోగులకు మలేరియా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అధికారికంగా రిపోర్టు కాని కేసులు సంఖ్య రెట్టింపు సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు డెంగీ పేరుతో రోగుల నుంచి రూ.వేలల్లో బిల్లులు వసూలు చేస్తున్నారు. ఆయా ఆస్పత్రులపై వైద్యశాఖ అధికారుల పర్యవేక్షణ కరువైందన్న ఆరోపణలున్నాయి.

పీహెచ్‌సీకి పెరిగిన ఓపీ

షాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆస్పత్రికి వస్తున్న రోగుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. గత నెలలో ఆస్పత్రులకు వచ్చిన అవుట్ పేషంట్ల సంఖ్య రోజుకు వంద మంది వరకు ఉండగా.. పది రోజులుగా నిత్యం 150కి పైగా ఓపీలు నమోదవుతోంది. వీరిలో అధికశాతం జ్వరం, సీజనల్ వ్యాధులు లక్షణాలతో వస్తున్నవారే ఉన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ప్రైవేట్ ఆస్పత్రులు సైతం రోగులతో కిటకిటలాడుతున్నాయి.

జాగ్రత్తలు తప్పనిసరి



డెంగీ కేసులు నమోదవుతున్న ప్రాంతాల్లో వైద్య సిబ్బంది కేసులు పెరగకుండా నివారణ చర్యలు చేపడుతున్నారు. ఇంటింటి జ్వర సర్వేతో బాధితులను గుర్తించి అవసరమైన మందులు అందిస్తున్నాం. సీజనల్ వ్యాధులకు అవసరమైన మందులు అన్ని ఆస్పత్రుల్లో సిద్ధంగా ఉంచాం.

– దామోదర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

అప్రమత్తంగా ఉండాలి



ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి. చుట్టు పక్కల పరిసరాల్లో దోమల ఉధృతి పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సీజనల్ వ్యాధులపై ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. ప్రభావిత గ్రామాల్లో వైద్యసిబ్బందితో శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాం.

– డాక్టర్ విజయలక్ష్మి, పీహెచ్‌సీ, షాబాద్

వేంకటేశ్వరస్వామి ఆలయానికి విరాళం


విరాళం అందజేస్తున్న వెంకటేశం

షాద్‌నగర్: జానంపేట వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామి వారి రథం, ఆలయ ప్రధాన ద్వారాల ఏర్పాటునకు పట్టణానికి చెందిన ఆకుల వెంకటేశం గురువారం రూ. 5,11,000లు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలుకు భక్తుడు ఆకుల వెంకటేశం విరాళానికి సంబంధించిన చెక్కు అందజేశారు. స్వామి వారి రథం, ఆలయ ప్రధాన ద్వారాలను తయారు చేసేందుకు కర్ణాటక రాష్ట్రంలోని గంగావతి నుంచి వచ్చిన శిల్పులకు దాత ఇచ్చిన విరాళాన్ని బక్కని నర్సింలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఒగ్గుకిషోర్, సూరిశెట్టి నర్సింలుగుప్తా, కౌన్సిలర్ బచ్చలి నర్సింహ్మా, సాయిశ్వర్‌రెడ్డి, భూపాల్, వినోద్, శ్రీనివాసచార్యులు, తేజ తదితరులు పాల్గొన్నారు.

నా చావుకు.. వారే కారణం


పురందాస్ (ఫైల్)

కందుకూరు: వివాహితతో ఏర్పడిన స్నేహం ఓ యువకుడి బలవన్మరణానికి దారితీసింది. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మురళీనగర్‌కు చెందిన ఓ వివాహితకు ఇద్దరు పిల్లలు, భర్త ఉన్నారు. ఇదే గ్రామానికి చెందిన ముడావత్ పురందాస్(32) అనే వ్యక్తికి వివాహం కాలేదు. సదరు మహిళతో ఇతనికి ఏర్పడిన పరిచయం చనువుగా మారింది. కొద్ది రోజుల తర్వాత ఇరువురి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో ఈనెల 7న సదరు మహిళ.. పురందాస్ అన్న శంకర్‌కు ఫోన్ చేసి.. 'మీ తమ్ముడు నా గురించి గ్రామంలో తప్పుగా చెబుతున్నాడు. అతడిని తీసుకుని మాఇంటికి రాకపోతే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటా' అని బెదిరించింది. ఈ విషయాన్ని శంకర్ వెంటనే తమ్ముడికి ఫోన్ చేసి చెప్పాడు. అదే రోజు రాత్రి 'నేను మందు తాగి చనిపోతున్నా. నా చావుకు ఆ మహిళతో పాటు ఆమెకు సహకరిస్తున్న గ్రామానికి చెందిన కాట్రావత్ కిరణ్, వంకడావత్ గురుసింగ్ కారణం' అని పురందాస్ తన అన్నకు వాయిస్ మెసేజ్ చేశాడు. దీంతో కంగారుపడిన శంకర్ తమ్ముడిని వెతుకుతూ పొలం వద్దకు వెళ్లి చూడగా, అప్పటికే పురుగుల మందు తాగి కింద పడి ఉన్నాడు. వెంటనే అతన్ని 108 అంబులెన్స్ వాహనంలో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ బుధవారం రాత్రి పురందాస్ మృతి చెందాడు. ఈ మేరకు ఎస్ఐ సైదులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పురుగు మందుతాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ మృతి

మైనార్టీలకు అండగా ప్రభుత్వం


దీపక్ జాన్‌ను సన్మానించిన క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

తుర్కయంజాల్: ప్రభుత్వం మైనార్టీలకు అండగా నిలుస్తుందని రాష్ట్ర క్రిస్టియన్(మైనార్టీస్) ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ పేర్కొన్నారు. ఇంజాపూర్‌లోని రెహోబోత్ ప్రార్థనా మందిరంలో గురువారం నిర్వహించిన తుర్కయంజాల్ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ సువర్ణ రాజు, సభ్యులు జార్జ్, రాజు, అరుణ్ బాబు, ఎలియా, యేసుదాస్, శామ్యూల్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

శంకర్‌పల్లి: కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన గురువారం శంకర్‌పల్లి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెందిప్ప గ్రామానికి చెందిన మల్లేశం, మౌనిక(26)లు దంపతు లు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కూతురు(9), కొడుకు(7) ఉన్నారు. కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య కుటుంబ పరమైన విషయాలపై గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం ఎక్కువ కావడంతో మౌనిక మనస్తాపానికి గురైంది. దీంతో రాత్రి అందరూ నిద్రించిన తర్వాత ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

భయంతో యువతి బలవన్మరణం

మాడ్గుల: తన తోటి మిత్రురాలు ఆత్మహత్య చేసు కోవడంతో భయాందోళన చెందిన ఓ అమ్మాయి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మాడ్గుల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాడ్గుల గ్రామానికి చెందిన చిక్కుడు రాములుకు ముగ్గురు కూతుర్లు. ఆయన రెండో కూతురు మౌనిక(19) రెండేళ్ల నుంచి హైదరాబాద్‌లోని నాంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకుంటూ.. దిల్‌సుఖ్‌నగర్ ఎస్సీ హాస్టల్‌లో ఉంటుంది. అదే హాస్టల్లో ఉంటున్న మరో యువతి ఇటీవలే ఆత్మహత్య చేసుకుంది. దీంతో భయంగా ఉందని మౌనిక తన తండ్రికి ఫోన్ చేసి బుధవారం ఇంటికి వెళ్లింది. ఆమె ఇంట్లో ఎవ రూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. కుటుంబసభ్యులు ఆమెను చికిత్స కోసం ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ గురువారం ఉదయం మౌనిక మృతి చెందింది. దీనిపై యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తక్కువ పెట్టుబడితో లాభాలు

- పట్టు పురుగుల సాగుకు కేంద్రం ప్రోత్సాహం
- డీఎస్‌హెచ్‌ఓ సురేశ్‌నాయక్


కోరింతకుంటతండాలో పట్టు పురుగుల పెంపకం గదిని పరిశీలిస్తున్న డీఎస్‌హెచ్‌ఓ సురేశ్‌నాయక్ తదితరులు

తలకొండపల్లి: పట్టు పురుగల పెంపకంతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల(డీఎస్‌హెచ్‌ఓ) అధికారి సురేశ్ నాయక్ పేర్కొన్నారు. మండలంలోని కోరింతకుంట తండాలో గురువారం మల్బరీ తోట, పురుగుల పెంపకాన్ని ఆయన మండల ప్రత్యేక అధికారి, సెరికల్చర్ ఏడీ ముత్యాలు, హార్టికల్చర్ ఏడీ కిషన్ రావుతో కలిసి పరిశీలించారు. పట్టు పురుగుల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టు పురుగుల పెంపకానికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చి అనేక రాయితీలు ఇస్తుందని తెలిపారు. షెడ్ నిర్మాణానికి ఎస్సీ, ఎస్టీలకు రూ.2.92 లక్షలు బీసీ, ఇతరులకు రూ.2.25 లక్షలు, ప్లాంటేషన్ చార్జి కింద ఎస్సీ, ఎస్టీలకు రూ.78వేలు, బీసీ, ఇతరులకు రూ. 60వేలు అందజేస్తున్నట్లు వివరించారు.

మల్బరీ సాగుకు సబ్సిడీ

ఎకరా పొలంలో 5,500 మొక్కలు నాటుకోవచ్చునని, ప్రభుత్వ సూచనల మేరకు రెండు ఎకరాల్లో మల్బరీని సాగు చేసినట్లయితే, షెడ్‌కు సబ్సిడీ నిధులు మంజూరు అవుతాయని చెప్పారు. పట్టు పురుగుల జీవిత కాలం 25 రోజుల నుంచి 31 రోజుల వరకు ఉంటుందని, ఈ రోజుల్లోనే మార్కెట్లో పురుగులను విక్రయించుకోవచ్చని సూచించారు. మార్కెటింగ్‌కు పురుగులను తీసుకెళ్లిన అనంతరం షెడ్‌ను బ్లీచింగ్ పౌడర్, సున్నంతో శుభ్రం చేసుకున్నట్లయితే వైరస్, బ్యాక్టీరియాను నివారించవచ్చని స్పష్టంచేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీకాంత్, ఏపీఓ రఘు, పట్టు రైతుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శత్రునాయక్, శ్రీనునాయక్, బిచ్చానాయక్, రాజు, రవీందర్, కృష్ణయ్య, హన్మంత్, యాదయ్య, శేఖర్‌రెడ్డి, మల్లేశ్, తిరుపతిరెడ్డి, దేవీలాల్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్యాన్ని కాపాడుకుందాం

జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ హరిసర్వోత్తమన్


శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న హరిసర్వోత్తమన్

కడ్తాల్: జీవ వైవిధ్యం దెబ్బతింటే పర్యావరణంతోపాటు మానవ మనగడకు ముప్పు వాటిల్లుతుందని.. జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ (జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా) హరిసర్వోత్తమన్ అన్నారు. అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని ఎర్త్‌సెంటర్‌లో కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్- తెలంగాణ పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్కూల్ ఎర్త్ క్లబ్ యంగ్ ఎర్త్ లీడర్స్' సెకండ్ బ్యాచ్ ఓరియంటేషన్ కార్యక్రమం గురువారంతో ముగిసింది. శిక్షణ కార్యక్రమానికి మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట్ జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరిసర్వోత్తమన్ మాట్లాడుతూ.. విచక్షణా రహితంగా చెట్లను నరకడం మానుకోవాలని, పంటలకు ఇష్టానుసారం క్రిమి సంహారక మందులను వినియోగించొద్దని సూచించారు. వృక్ష, జంతు, పక్షి జాతులు అంతరించిపోతే మానవ మనుగడకు ప్రమాదమని హెచ్చరించారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిలిపివేయడం ద్వారా పర్యావరణంతో పాటు భూగోళాన్ని రక్షించుకోవాలని పేర్కొన్నారు. ప్రొఫెసర్ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు జీవన విలువలు, నైపుణ్యాలు నేర్పి భవిష్యత్ పర్యావరణ పరిరక్షకులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని తెలిపారు. సీజీఆర్ చైర్ పర్సన్ లీలా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి పాఠశాల ఒక ఎర్త్‌సెంటర్‌గా రూపాంతరం చెందాలని, ప్రతి విద్యార్థిలో పర్యావరణ స్పృహ కలిగించాలన్నారు. సీజీఆర్ ఫౌండర్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణను సైతం దేశ రక్షణగా భావించాలని సూచించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఉమామహేశ్వర్‌రెడ్డి, సాయిభాస్కర్‌రెడ్డి, ఐఈఎస్ స్పెషలిస్ట్ అన్నమయ్య, అడ్మిన్ అధికారి అనుదీప్, ప్రోగ్రాం ఆఫీసర్స్ నగేశ్, రజనీకాంత్, లక్ష్మీప్రసన్న, హరితాదేవి, సీజీఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు అరెస్టుతో ఆందోళన


ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఠాణా ఎదుట నిరసన వ్యక్తంచేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతలు

తలకొండపల్లి: కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి చేసిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ గురువారం హైదరాబాద్ సీపీ కార్యాలయం వద్ద మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు.. బీఆర్ఎస్ నాయకులు బైఠాయించారు. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని పోలీసులు కోరినా ససేమిరా అన్నారు. దీంతో పోలీసులు వారిని బలవంతంగా వాహనాల్లో ఎక్కించి హైదరాబాద్ నుంచి తలకొండపల్లి ఠాణాకు తీసుకు రానున్నట్లు సమాచారం అందుకున్న పార్టీ శ్రేణులు.. తలకొండపల్లి పోలీస్ స్టేషన్ వద్దకు తరలివచ్చారు. అదే సమయంలో కొన్ని వాహనాలు ఠాణాకు చేరుకున్నాయి. అందులో హరీశ్ ఉన్నాడని భావించిన నేతలు.. ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. వాహనాలను అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, గులాబీ శ్రేణులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. కార్యకర్తలు పోలీసులు ఒక్కరినొకరు తోసుకున్నారు. తీరా ఠాణాకు వచ్చిన వాహనాల్లో హరీశ్ లేడని తెలుసుకున్నారు. అనంతరం పోలీసులు ఆందోళన కారులతో సంతకాలు చేయించుకొని కేశంపేట్‌కు తరలించినట్లు సమాచారం. ఆందోళనలో శాసన మండలిలో ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు బండారు లక్ష్మారెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక, సంజయ్ కుమార్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాగంటి గోపీనాథ్, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు, ఎర్రోళ్ల శ్రీనివాస్ ఉన్నారు.

గణనాథుల సేవలో మంత్రులు


గణపతిని దర్శించుకున్న మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

బడంగ్‌పేట్: ప్రసిద్ధి చెందిన బాలాపూర్, బడంగ్‌పేట్ గణనాథులను మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గురువారం దర్శించుకున్నారు. నిర్వాహకులు వారికి ఘన స్వాగతం పలికారు. మంత్రులు ఆయా మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, మేయర్ పారిజాత తదితరులు ఉన్నారు.